రామగుండం మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ - పోలీసుల విచారణ 6లో..

అక్రమంగా బొగ్గును తరలిస్తున్న లారీ పట్టివేత 6లో..



మార్కెట్ కమిటీల రద్దు

- నెల క్రితమే పెద్దపల్లి కమిటీ రద్దు
- కోర్టును ఆశ్రయించిన చైర్మన్
- పిటిషన్ డిస్మిస్ చేసిన కోర్టు
- ఆ తర్వాతనే మిగతా మార్కెట్ కమిటీల రద్దు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలోగల ఆయా వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలకవర్గాల పదవీకాలం ముగియకముందే, వాటిని రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆశావహుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. నెలరోజుల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాల్లో గెలుపొంది అధికారంలోకి వచ్చింది. దీంతో గత ప్రభుత్వ హయాంలో నియమించిన వివిధ కార్పొరేషన్ల చైర్మన్లను తొలగించిన విషయం తెలిసిందే. అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలక వర్గాలను కూడా తొలగించాలని నిర్ణయం తీసుకున్నది. అందులో భాగంగా సోమవారం జిల్లాలోని కమాన్‌పూర్, మంథని, సుల్తానాబాద్, ధర్మారం మార్కెట్ కమిటీలను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతనెల 13న పెద్దపల్లి మార్కెట్ కమిటీని రద్దు చేసింది. జిల్లాలో మొత్తం 8 మార్కెట్ కమిటీలు ఉండగా, కాల్వశ్రీరాంపూర్, జూలపల్లి, రామగుండం మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలు నియమించలేదు. గతంలో మార్కెట్ కమిటీల పాలక వర్గాల పదవీకాలం ఏడాది ఉండగా, 2022లో వాటి పదవీ కాలాన్ని రెండేళ్లకు పొడిగించారు. అవసరాన్ని బట్టి ఆరు మాసాల చొప్పున పొడిగించుకుంటూ వెళుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రద్దయిన ఐదు మార్కెట్ యార్డుల పాలకవర్గాల పదవీకాలం ఇంకా పూర్తికాకముందే ప్రభుత్వం రద్దు చేసింది. జనవరిలో పెద్దపల్లితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 33 మార్కెట్ యార్డుల పాలకవర్గాలను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో 18 మార్కెట్ కమిటీల చైర్మన్లు కోర్టును ఆశ్రయించారు. అందులో పెద్దపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ జడల సురేందర్ కూడా ఉన్నారు. వీళ్ల కోర్టును ఆశ్రయించడంతో మిగతా మార్కెట్ల పాలకవర్గాలను రద్దు చేయలేదు. 18 మార్కెట్ కమిటీల చైర్మన్లు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన సింగిల్ బెంచ్ సోమవారం డిస్మిస్ చేసింది. ఆ వెంటనే రాష్ట్రంలో ఉన్న మిగతా మార్కెట్‌యార్డుల పాలక వర్గాల పదవీకాలాన్ని రద్దు చేసింది. ఎవరన్న అప్పీలుకు వెళితే మళ్లీ విచారణ జరిగే అవకాశం ఉంటుంది.

మార్కెట్ పదవులపై ఆశలు..

పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు మార్కెట్ పదవులపై ఆశలు పెంచుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో మార్కెట్ కమిటీల చైర్మన్ పదవులకు రిజర్వేషన్ విధానాన్ని రొటేషన్ పద్ధతిన అమలుచేసింది. ప్రస్తుత ప్రభుత్వం ఆ విధానాన్ని అమలు చేస్తుందా, లేదా అనేది తెలియడం లేదు. వాస్తవానికి జనవరి నెలాఖరు వరకే రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల పందేరం ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ ఆ దిశగా ఇంకా కసరత్తు పూర్తికాలేదు. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవుల భర్తీ పూర్తయిన తర్వాత జిల్లా స్థాయిలో ఉండే మార్కెట్ కమిటీలు, దేవాదాయాల ధర్మకర్తల మండలిని నియమించనున్నారు. జిల్లాలో 8 మార్కెట్ యార్డులకు నామినేషన్ ప్రాతిపదికన చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, సభ్యులను నియమించాల్సి ఉంది. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులే గెలుపొందడంతో ఎమ్మెల్యేలు సూచించిన వారికే నామినేటెడ్ పదవులు దక్కనున్నాయి. మార్కెట్ కమిటీల రిజర్వేషన్లను కొనసాగించాలా, వద్దా అనే నిర్ణయం తీసుకున్న తర్వాత పాలక వర్గాలను నియమించనున్నారు. అయితే పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌ను ఈ నెలాఖరులో గానీ, వచ్చేనెల మొదటి వారంలో గానీ ప్రకటిస్తే మాత్రం ఆ ఎన్నికలు పూర్తయిన తర్వాతనే మార్కెట్ పదవులు దక్కనున్నాయి. నామినేటెడ్ పదవుల కోసం చాలా మంది పోటీ పడుతున్నారు. ఇప్పటికే మంత్రి, ఎమ్మెల్యేల వెంటే తిరుగుతున్నారు. పార్టీ బలోపేతం కోసం అభ్యర్థుల గెలుపు కోసం సీన్సియర్‌గా కష్టపడిన వారికే పదవులు ఇవ్వాలని కార్యకర్తలు కోరుతున్నారు.

బదిలీపై జిల్లాకు వచ్చిన ఎంపీడీవోలకు పోస్టింగులు

పెద్దపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వివిధ జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన ఎంపీడీవోలకు పోస్టింగ్‌లు ఇస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. జగిత్యాల జిల్లా నుంచి వచ్చిన జి తిరుపతికి ఓదెల ఎంపీడీవోగా, జి. శైలజరాణికి రామగిరి ఎంపీడీవోగా, ఐ. ప్రవీణ్‌కుమార్‌కు ధర్మారం ఎంపీడీవోగా, ఏ.పద్మజాకు జూలపల్లి ఎంపీడీవోగా పోస్టింగ్ ఇచ్చారు. కరీంనగర్ జిల్లా నుంచి వచ్చిన వై.భాస్కర్‌రావుకు ఎలిగేడు ఎంపీడీవోగా, దివ్యదర్శన్‌రావుకు సుల్తానాబాద్ ఎంపీడీవోగా, కె శ్రీనివాస్‌కు మంథని ఎంపీడీవోగా పోస్టింగ్ ఇచ్చారు. మంచిర్యాల జిల్లా నుంచి వచ్చిన పి శశికళకు పాలకుర్తి ఎంపీడీవోగా, ఎంఏ అలీంకు అంతర్గాం ఎంపీడీవోగా, సిద్దిపేట జిల్లా నుంచి వచ్చిన జి.శ్రీనివాస్‌గౌడ్‌కు పెద్దపల్లి ఎంపీడీవోగా పోస్టింగ్ ఇచ్చారు.

జిల్లాస్థాయి సైన్స్ పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేస్తున్న డీఈవో

పెద్దపల్లి కల్చరల్ , ఫిబ్రవరి 13 : జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ అధ్వర్యంలో మంగళవారం పెద్దపల్లి జిల్లా స్థాయి సైన్స్ పోటీలు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి మాధవి వీటిని పర్యవేక్షించి అనంతరం విజేతలకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని మండలాల నుంచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పాటలు, కవిత్వం, పెయింటింగ్, ఉపన్యాస పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరిగిందని డీఈవో మాధవి అన్నారు. ప్రథమంగా నిలిచిన విద్యార్థులను ఈనెల 28న జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధ్యక్షుడు కానుగంటి శ్రీనివాస్, ఎంఈవో సురేంద్ర కుమార్ పాల్గొన్నారు.

ఢిల్లీలో రైతుల అరెస్టుకు నిరసనగా ఎడ్లబండ్లతో రాస్తారోకో



ఎడ్లబండ్లతో రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు, నాయకులు

ఓదెల, ఫిబ్రవరి 13 : డిమాండ్ల పరిష్కారం కోసం ఢిల్లీకి వచ్చిన రైతులను అక్రమంగా అరెస్టు చేసినందుకు నిరసనగా రైతులకు మద్దతుగా, మంగళవారం మండలంలోని కొలనూర్‌లో రైతులు, కాంగ్రెస్ నాయకులు ఎడ్లబండ్లతో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించుకునేందుకు ఢిల్లీకి వచ్చిన రైతులను మోదీ ప్రభుత్వం అడ్డుకొని అక్రమ అరెస్టులు చేసి, ఏర్పాటు చేసిన బారికేడ్లు, సిమెంట్ దిమ్మెలతో పాకిస్తాన్ సరిహద్దులను మరిపించారని అన్నారు. స్వామినాథన్ కమిషన్ ప్రకారం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని చర్చల కోసం వచ్చిన రైతులను మోదీ ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేయడం ప్రభుత్వ నియంతృత్వానికి నిదర్శనమని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పాలనలో ఉన్నప్పుడు ఏ రైతు కూడా రోడ్డెక్కలేదని, కేంద్రంలో బీజేపీ పాలించినన్నాళ్లు ఏనాడు కూడా రైతులు పట్టించుకోకుండా రైతులపై ఉక్కు పాదం మోపుతూ, పండించిన ధాన్యానికి కనీసం గిట్టుబాటు ధర కూడా కల్పించలేదన్నారు. తమ డిమాండ్లను పరిష్కారం కోసం వస్తున్న రైతులను ఉక్కుపాదంతో అణచివేస్తూ, బారికేడ్లు, ఇనుప కంచెలు వేసి పాకిస్తాన్ సరిహద్దులను మరిపించారని, వెంటనే కేంద్ర ప్రభుత్వం రైతుల డిమాండ్లను పరిష్కరించి అక్రమ కేసులను ఎత్తివేయాలని రైతులు, నాయకులు కోరారు. రెండు గంటలపాటు ఎడ్లబండ్లను రోడ్డుకు అడ్డంగా నిలిపి నిరసన వ్యక్తం చేశారు. దీంతో వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య, సింగిల్‌విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, కాసారపు ఐలయ్యగౌడ్, మాజీ సర్పంచులు మారవేణి రామస్వామి, బొంగోని రాజయ్యగౌడ్, రైతులు శ్రీనివాస్, మహేష్, శ్రీకాంత్, ఐలయ్య, పున్నారెడ్డి, తిరుపతి రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్, అరవింద్, కిష్టస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఈ నేల త్యాగాల చరిత్ర.. 'బొగ్గు రవ్వలు'

- పుస్తకావిష్కరణ సభలో వక్తలు



పుస్తకావిష్కరణలో ప్రొఫెసర్ హరగోపాల్, ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ తదితరులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): 'గురిజాల రవీందర్ సింగరేణి ఉద్యమ అనుభవాలు 'బొగ్గు రవ్వలు' చదువుతుంటే ఉద్వేగ పూరిత అనుభవాన్ని కలిగిస్తోంది' అని పలువురు వక్తలు ప్రశంసించారు. 'సింగరేణి బొగ్గు గనుల్లోని ప్రతి పెల్లకు అమరుల రక్తం అంటుకుంది' అంటూ రచయిత రాసిన వాక్యాలు హృదయాన్ని కదిలిస్తాయంటూ వక్తలు కొనియాడారు. తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఇటీవల బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'బొగ్గు రవ్వలు' పుస్తకాన్ని ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ హరగోపాల్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనిషిని ఉన్నతీకరించే సాంస్కృతిక పరమైన మార్పు కోసం ప్రగతిశీల సమూహాలు మరింత శక్తమంతంగా ఉద్యమించాలని ఆకాంక్షించారు. ప్రధాన వక్తగా హాజరైన 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ద్వేష రాజకీయాలు నడుస్తోన్న ప్రస్తుత కాలంలో ఈ నేల త్యాగాల చరిత్రను గుర్తుచేసేందుకు 'బొగ్గు రవ్వలు' తోడ్పడుతుందన్నారు. స్వార్థరాహిత్యంతో ప్రపంచాన్ని మార్చడం కోసం తపనపడే వ్యక్తులు ఈ పుస్తకంలో తారసపడతారని తెలిపారు. తెలుగు ప్రాంతాల్లోని ప్రజావిప్లవ రాజకీయాల చరిత్ర రికార్డు కావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన రవీందర్, ఆ పోరాట అనుభవాలనూ రాయాల్సిందిగా కె. శ్రీనివాస్ కోరారు. ప్రజా ఉద్యమాల చరిత్రను పదే పదే ప్రజలకు గుర్తుచేయడం కోసం ఇలాంటి పుస్తకాలు మరెన్నో రావాలని ఆకాంక్షించారు. ఉమ్మడి ఏపీ హైకోర్టు విశ్రాంత జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని ఉద్యమకారులకు కరదీపకగా అభివర్ణించారు. ఎన్‌కౌంటర్లు, అక్రమ నిర్బంధాలు వంటి వాటికి వెరవకుండా నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పనిచేస్తోన్న అసలైన దేశభక్తులు ఈ పుస్తకం ద్వారా పరిచయం అవుతారన్నారు. పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ కర్త రామకృష్ణారావు మాట్లాడారు. హెచ్ రవీందర్ పుస్తక సమీక్ష చేశారు. డాక్టర్ చమన్‌సింగ్ సభాధ్యక్షత వహించగా, విద్యావంతుల వేదిక అధ్యక్షుడు అంబటి నాగయ్య, జర్నలిస్టు రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

రామగుండం కార్పొరేషన్‌లో పన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

- కమిషనర్ నాగేశ్వర్

కోల్‌సిటీ, ఫిబ్రవరి 13: రామగుండం కార్పొరేషన్‌లో 2023-24 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున వల్ల పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్టు రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్ చెప్పారు. పన్ను వసూళ్లలో పురోగతి సాధించడానికి స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టనున్నట్టు, ఇంటి పన్నులు, నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు సకాలంలో చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని పేర్కొన్నారు. పన్నులు చెల్లించడానికి గడువు తేది దాటిపోయిన నేపథ్యంలో జరిమానాతో సహా పన్నులను వసూలు చేస్తున్నట్టు చెప్పారు. మొండి బకాయిదారుల ఆస్తులు జప్తు చేయడంతో పాటు వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు కలెక్టరేట్‌లో వైద్య శిబిరం



అదనపు కలెక్టర్ అరుణశ్రీకి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెద్దపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల ఆరోగ్య పరిరక్షణ దిశగా హెల్త్ ప్రొఫైల్ రూపకల్పనకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధ్వర్యంలో మంగళవారం హెల్త్‌స్క్రీనింగ్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ క్యాంపులో ఉద్యోగులకు సీబీపీ (కంప్లీట్ బ్లడ్ పిక్చర్) పరీక్ష నిర్వహించి హిమోగ్లోబిన్ రక్త కణాల సంఖ్య, తెల్ల రక్తకణాల వివరాలను, ఆర్‌బీఎస్ ద్వారా మధుమేహం స్థాయి, ఎల్‌ఎఫ్‌టి ద్వారా కాలేయ పనితీరు, ఆర్‌ఎఫ్‌టి పరీక్ష ద్వారా కిడ్నీల పనితీరు, థైరాయిడ్ ప్రొఫైల్ లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలు, ఈసీజీ, కాల్షియం, తదితర పరీక్షలను నిర్వహించారు. పరీక్షల ద్వారా వచ్చిన ఫలితాల ప్రకారం ఉద్యోగులు పాటించాల్సిన డైట్ వివరాలు, చేయాల్సిన మెడిటేషన్, తీసుకోవాల్సిన మందులపై వైద్యనిపుణులతో అవసరమైన సహకారం, సలహాలను అందజేయనున్నారు. అదనపుకలెక్టర్ అరుణశ్రీ, డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్‌కుమార్, డీఏవో ఆదిరెడ్డి, ఉపాధి కల్పనాధికారి తిరుపతిరావు, డీటీసీడబ్ల్యూవో రంగారెడ్డి, సీపీవో రవీందర్, డీపీఆర్‌వో అయూబ్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పతకాలు

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 13 : కరీంనగర్‌లో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఓదెల మండలం ఎంపీ యూపీఎస్ హరిపురం పాఠశాల నుంచి 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 12 మంది విద్యార్థులు పతాకలు సాధించారు. వారిని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్ అరుణశ్రీ, డీఈవో మాధవి, ఏఎంవో పీఎం షేక్, ఏఎస్‌వో అజీముద్దీన్, జీసీడీవో కవిత, ప్లానింగ్ కోఆర్డినేటర్ మల్లేశం, విజయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు మహేందర్‌రెడ్డి, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ బిక్షపతి, తదితరులు విద్యార్థులను అభినందించారు.

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 13: ఈనెల 11న కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలకు చెందిన 35మంది విద్యార్థులు పాల్గొనగా 9మంది గోల్డ్‌మెడల్, 9మంది సిల్వర్‌మెడల్, 12మంది రజిత పతకం, ఐదుగురు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. మంగళవారం పాఠశాలలో కరాటే పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవితో పాటు ఉపాధ్యాయులను అభినందించారు.

జాతీయ రహదారి భూసేకరణపై సమావేశం



భూనిర్వాసితులతో సమావేశమైన అధికారులు

ముత్తారం, ఫిబ్రవరి 13 : జాతీయ రహదారి నిర్మాణం కోసం చేపట్టే భూసేకరణలో భాగంగా ముత్తారం మండలం ఓడెడు గ్రామపంచాయతీ కార్యాలయంలో మంథని ఆర్డీవో వి.హనుమ నాయక్ అవార్డు విచారణ నిర్వహించారు. ఈ సమావేశంలో భూమికి నష్టపరిహారం చట్టం ప్రకారం చెల్లించడం జరుగుతుందని ఆర్డీవో తెలిపారు. ఈ సమావేశంలో రైతులు అడిగిన ప్రశ్నలకు ఆర్డీవో సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో, తహసీల్దార్ సుమన్, మాజీ సర్పంచ్ భక్కరావు, ఎంపీటీసీ కిషన్‌రెడ్డి, ఆర్ఐ భవానిప్రసాద్‌శ్రీధర్, భూనిర్వాసితులు, ప్రజలు పాల్గొన్నారు.

కాగా, ఆర్డీవో తమతో దురుసుగా మాట్లాడి వెళ్లిపోయారంటూ పలువురు రైతులు ఆరోపించారు. తమకు సరైన విధంగా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని భూనిర్వాసితులు, రైతులు పి.సుధాకర్‌రెడ్డి, నూనెటి సాయి కృష్ణ, ఎం లింగమ్మ, ఎ. మధునయ్య, తాటిపాముల శంకర్, శ్రీను, కమల, వీరారెడ్డి, రాజమల్లు, పింగిలి ప్రభాకర్‌రెడ్డి, మందల శ్రీనివాస, స్రవంతి, పందుల రాజు కోరారు.

గ్రామాల సమగ్రాభివృద్ధికి అధికారులు కృషి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



బదిలీపై వెళుతున్న అధికారులను సన్మానిస్తున్న కలెక్టర్ తదితరులు

పెద్దపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామాల సమగ్రాభివృద్ధి దిశగా గ్రామీణ శాఖలకు అధిపతులుగా సంబంధిత అధికారులు అత్యుత్తమ సేవలనందించారని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కొనియాడారు. బదిలీపై వెళ్తున్న డీపీఓ వి చంద్రమౌళి, డీఆర్‌డీఓ వి శ్రీధర్, జడ్పీ సీఈవో ఎం శ్రీనివాస్, ఏపీడీ సునీతలకు మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ, అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి బాటలో నడుపుతూ జాతీయ స్థాయిలో అనేక అవార్డులు సాధించడంలో సంబంధిత శాఖలకు నాయకత్వం వహిస్తూ జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీధర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్‌ల పాత్ర ఎంతో ఉందని కొనియాడారు. అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా, పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించడంలో అధికారులు కీలకపాత్ర పోషించారని అన్నారు. ప్రజలలో సైతం మంచి పేరు సాధించడంలో అధికారులు సఫలీకృతులయ్యారని, పెద్దపల్లి జిల్లాలో గ్రామాలను అన్ని రంగాలలో ఆదర్శంగా తీర్చిదిద్దడంలో కృషి చేసారని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఆర్‌డీఓ సీహెచ్ మధుమోహన్, డీఏఓ ఆదిరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్‌ఖాన్, జిల్లా ఉపాధి అధికారి వై తిరుపతిరావు, జిల్లా విద్యాశాఖ అధికారి డి మాధవి, సంబంధిత జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామగుండంలో బీఆర్‌ఎస్‌కు భారీ షాక్

- 15మంది బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లోకి..? - అసెంబ్లీ సమావేశాల తర్వాత చేరికలు
- అనుమతించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ - పార్లమెంట్ ఎన్నికల ముందు మరో పది మంది?


గోదావరిఖని, ఫిబ్రవరి 13: రామగుండంలో బీఆర్‌ఎస్ పార్టీకి భారీ షాక్ తగలనున్నది. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 15మంది రామగుండం కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమయ్యింది. ఈ కార్పొరేటర్ల చేరికను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అనుమతించినట్టు తెలిసింది. గత రెండు మాసాలుగా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రామగుండం ప్రాంతంలోని బీఆర్‌ఎస్ నాయకులు, కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నించినప్పటికీ ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అంగీకరించలేదు. అయితే రెండు రోజుల క్రితం బీఆర్‌ఎస్‌కు చెందిన 15మంది కార్పొరేటర్లు హైదరాబాద్‌లో మక్కాన్‌సింగ్‌ను కలిసి పార్టీలో చేరేందుకు కోరగా అందుకు మక్కాన్‌సింగ్ అంగీకరించినట్టు తెలిసింది. అసెంబ్లీ సమావేశాల అనంతరం ఈనెలలో 15 మంది కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. వీరితో పాటు మరో ఐదుగురు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధపడినప్పటికీ మక్కాన్‌సింగ్ వాళ్ల చేరిక పట్ల అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలిసింది. కార్పొరేషన్‌లోని 50మంది కార్పొరేటర్లలో ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలో 12మంది ఉన్నారు. మిగిలిన 38మందిలో మేయర్ అనీల్ కుమార్ మినహా 37మంది బీఆర్‌ఎస్ కార్పొరేటర్లలో ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరే 15మంది కార్పొరేటర్లతో పాటు మరో పది మంది కార్పొరేటర్లు పార్లమెంట్ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధపడుతున్నట్టు సమాచారం. అయితే రెండు మాసాల్లో ఉన్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంలో విడుతల వారీగా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లను, నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అంగీకరించినట్టు తెలిసింది. యైటింక్లయిన్‌కాలనీ ప్రాంతానికి చెందిన బీఆర్‌ఎస్ కార్పొరేటర్లతో పాటు గోదావరిఖని ఉత్తర ప్రాంతానికి చెందిన కార్పొరేటర్లు మొదటి విడతగా కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమయ్యింది. కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన కార్పొరేటర్లు తిరిగి కాంగ్రెస్‌లో చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినప్పటికీ మక్కాన్‌సింగ్ వారి చేరిక పట్ల విముఖత వ్యక్తం చేసినట్టు సమాచారం. ఈ పరిణామం బీఆర్‌ఎస్ పార్టీకి రామగుండం ప్రాంతంలో భారీ షాక్ నిచ్చినట్లయ్యింది.

అంబేద్కర్ యువజన సంఘం ఎన్నిక

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 13: రామగిరి మండలం వెంకట్రావ్‌పల్లె ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. సింగరేణి ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమాజంలో కుల వివక్ష ఇంకా కొనసాగుతున్నదని, సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా పరంగా సమస్యలు ఎదుర్కొంటున్న దళితులకు సంఘం అండగా ఉంటుందని అన్నారు. దళితులను కులం పేరిట దూషించి, దాడులకు పాల్పడే వారికి చట్టపరంగా శిక్షలు పడేలా అంబేద్కర్ యువజన సంఘం పోరాడుతుందని మధు తెలిపారు. ఈసందర్భంగా గ్రామ శాఖ కమిటీని బొంకూరి మధు ప్రకటించారు. అనంతరం క్యాలండర్‌ను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో కాంపల్లి సతీష్, లింగయ్య, బొక్కల శ్రీనివాస్, సరోజిని, రమేష్, బూడిద సమ్మయ్య పాల్గొన్నారు.





వ్యవసాయ బావిలో మొసలి


బావి నుంచి బయటకు తీసిన మొసలి

రాయికల్, ఫిబ్రవరి 13: మండలంలోని దావన్పెల్లి గ్రామంలో కుర్ర శేఖర్ అనే రైతుకు చెందిన వ్యవసాయ బావిలో సోమవారం మొసలిని గుర్తించారు. ఈ సందర్భంగా భయాందోళనకు గురైన శేఖర్ గ్రామస్థుల సహాయంతో మొసలిని పట్టి అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. వ్యవసాయ బావిలోని నీరు ఎండిపోవడంతో మొసలి కనబడిందని, లేకుంటే ప్రమాదం పొంచి ఉండేదని రైతులు పేర్కొంటున్నారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


బోనం మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

వేములవాడ, ఫిబ్రవరి 13: రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ దేవాలయమైన బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. మేడారం సమ్మక్కసారక్క జాతరకు వెళ్లడానికి ముందు ఆనవాయితీ ప్రకారం సోమవారం తమ ఇష్టదైవమైన రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు మంగళవారం బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే భక్తిశ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారుచేసి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భారీ సంఖ్యలో జనం తరలి రావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. అమ్మవారి దర్శనానికి సుమారు రెండు గంటలకు పైగా సమయం పట్టింది.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 13: అనారోగ్యంతో బాధపడుతున్న గౌతమి నగర్కు చెందిన అమ్మిగల్ల చంద్రయ్య(46) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. మున్సిపల్లో కూలీగా పనిచేస్తున్న చంద్రయ్య అనారోగ్యంతో మందులు వాడుతున్నప్పటికీ నొప్పి తగ్గక పోవటంతో ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి భార్య రజిత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్యుత్ చౌర్యం కేసులో ముగ్గురికి జైలు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 13: విద్యుత్ చౌర్యం కేసులో ఇద్దరు నిందితులకు సోమవారం, మరొక నిందితుడికి మంగళవారం జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్రీవాణి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ట్రాన్స్కో విజిలెన్స్ ఎస్ఐ టి నరేష్ తెలిపారు. తిమ్మాపూర్ మండలం పర్లపల్లికి చెందిన మామిడి అర్జున్కు 3,658 రూపాయల జరిమానా లేదా 3 నెలల సాధారణ జైలుశిక్ష, కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన పొత్తూరి సుధాకర్కు 13,621 రూపాయల జరిమానా లేదా 3 నెలల సాధారణ జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. మానకొండూర్ మండలం శ్రీనివాసనగర్కు చెందిన వరికోలు సంపత్కు 4,691 రూపాయల జరిమానా లేదా 3 నెలల సాధారణ జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షల షెడ్యూలు విడుదల

గణేశ్నగర్ ఫిబ్రవరి13: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరగనున్న పీజీ మొదటి సెమిస్టర్, సిబిసిఎస్ రెగ్యులర్, బ్యాక్లగ్ పరీక్షలు ఈ నెల 27 నుంచి మార్చి2 వరకు జరగనున్నట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వి శ్రీరంగప్రసాద్ తెలిపారు. పరీక్షలు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం వీ గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు.


విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వం స్పందించాలి

గణేశ్నగర్,ఫిబ్రవరి 13: విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వం స్పందించాలని ధర్మ సమాజ్ పార్టీ(డిఎస్పి) ధర్మ స్టూడెంట్స్ యూనియన్(డిఎస్యు) నాయకులు గీతాభవన్ నుంచి కలెక్టరేట్ వరకు కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. సూర్యాపేట జిల్లా దురాజుల్లి సమీపంలోని ఇమాంపేట సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న దగ్గుబాటి వైష్ణవి ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించి దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని ధర్మ స్టూడెంట్స్ యూనియన్, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భువనగిరి వైష్ణవి, భవ్య, సూర్యాపేట దగ్గుపాటి వైష్ణవి, మాదాపూర్ నారాయణ ఐఐటి అకాడమీ వినయ్ విద్యార్థుల ఆత్మహత్యలకు కారకులైన అధికారులను శిక్షించాలని, విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని అన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దగ్గుబాటు వైష్ణవి ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి ఆ కుటుంబానికి న్యాయం చేయకపోతే ధర్మ సమాజ్ పార్టీ, ధర్మ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో కన్వీనర్ సదానందం, జిల్లా అధ్యక్షురాలు సాధన, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేశ్, జిల్లా నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.











మోటార్‌సైకిల్ ఢీకొని యువకుడి మృతి


ఏలిమి పవన్ (ఫైల్)

హుజూరాబాద్, ఫిబ్రవరి 13: హుజూరాబాద్‌లోని పర్కాల క్రాస్‌రోడ్ సమీపంలో బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తున్న ఓ యువకుడిని సోమవారం అర్ధరాత్రి మోటార్ సైకిల్ ఢీకొట్టింది. ఎల్కతుర్తి మండలం పెంచికలపేట గ్రామానికి చెందిన ఏలిమి పవన్ (24) అనే యువకుడు పర్కాల క్రాస్ రోడ్ వద్ద బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలోనే వెనుక వైపు నుంచి వరంగల్ జిల్లా వాసి మోటర్ సైకిల్‌పై వస్తూ ఢీకొట్టాడు. దీంతో పవన్‌కు తీవ్ర గాయాలు కాగా వరంగల్‌కు తీసుకెళ్లగా, పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి రవీందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జీ టౌన్ సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరికి గాయాలు

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 13: ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలైన సంఘటన వేములవాడ మండలంలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఎనుగంటి గ్రామానికి చెందిన ఏనుగుల గణేష్, నేరెళ్ల అజయ్ అనే యువకులు మంగళవారం సాయంత్రం ట్రాక్టర్ టైర్ పంచర్ చేయించుకుని ఎనుగంటి నుంచి హనుమాజీపేట వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో ట్రాక్టర్ అదుపు తప్పడంతో కల్వర్టు పైనుంచి ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు హుటాహుటిన స్థానిక ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి

● బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్

కోనరావుపేట, ఫిబ్రవరి 13: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతున్నాయని, ప్రజల కోసం భారతీయ జనతా పార్టీ కొట్లాడితే కాంగ్రెస్‌కు ఓటేస్తారా అని దేశం అంతా ఆశ్చర్యపోతోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ అన్నారు. కోనరావుపేట మండలంలోని నాగారం, కనగర్తి, నిజామాబాద్, కోనరావుపేట, నిమ్మపల్లి, మరిమడ్ల గ్రామాల్లో మంగళవారం ప్రజాహిత యాత్రను కొనసాగించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో ప్రజలు మహిళలు పాల్గొని బండి సంజయ్‌కి స్వాగతం పలికారు. నాగారంలో శివాజీ విగ్రహానికి పూలమాలవేసి ప్రజాహితయాత్ర ప్రారంభించారు. అనంతరం నాగారం, కోనరావుపేటలో ప్రసంగించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అయోధ్యలో శ్రీరాముడి గుడి కడితే దేశమంతా ప్రజలు పూజలు చేశారు. జైశ్రీరామ్ అని నినాదాలు చేస్తున్నారన్నారు. నరేంద్ర మోదీ మనకు రేషన్ బియ్యం ఉచితంగా అందిస్తే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్క రూపాయి వసూలు చేస్తున్నాడని అన్నారు. ఎలా దోపిడీ చేయాలో అనేది కుట్రలు చేస్తూనే ఉంటాడన్నారు. వేములవాడ నియోజకవర్గానికి రూ.572 కోట్ల 91 లక్షల నిధులు కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. ఉపాధి పనుల కోసం 182 కోట్ల 80 లక్షల రూపాయలు కేటాయించామన్నారు. మెటీరియల్ ఖర్చు కోసం 86 కోట్లు మొక్కల పెంపకానికి రూ. 92 కోట్లు ఖర్చు పెట్టామని అన్నారు. ఇన్ని నిధులు కేటాయిస్తే మొక్కలు ఎక్కడ కనిపించడం లేదన్నారు. కేసీఆర్ ఈ పైసలు అన్నిటినీ దారి మళ్లించాడన్నారు. ఒక్క నాగారం గ్రామానికే నాలుగు కోట్లు ఖర్చు చేశామన్నారు. బీజేపీ కార్యకర్తలను కేసీఆర్ జైల్లో పెట్టించాడని ఇదంతా ప్రజల కోసమే చేశామని అన్నారు. ఈ ఎన్నికల్లో మోదీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. టీఆర్ఎస్‌కు ఓటు వేస్తే మళ్లీ మోసపోతారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇంతవరకు రైతుబంధు, రుణమాఫీ వేయలేదని అన్నారు. మళ్లీ ఇప్పుడు ఎన్నికల కోడ్ వచ్చింది అని చెప్పి ఓట్లు వేయించుకుంటారని అన్నారు. అధికారులు కాళేశ్వరంపై సర్వే చేసి నివేదిక ఇచ్చినప్పటికీ కాంగ్రెస్ మంత్రులు హెలికాప్టర్‌లో కాలేశ్వరం వెళ్లొచ్చారు.. ఎందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ కృష్ణ నీటిపై, నల్గొండలో సభ పేరుతో బీఆర్ఎస్ నాటకాలు ఆడుతున్నాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష కోట్ల ధనాన్ని వృధా చేశానని ముక్కు నేలకు రాసి తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. పదేళ్ల పాలనలో కెసీఆర్ ఆస్తులు పెరిగాయని అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు గోపాడి సురేందర్‌రావు, మిరియాల్‌కార్ బాలాజీ, రేగుల మల్లికార్జున్, మాజీ జడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.


కోనరావుపేటలో బండి సంజయ్‌ని సన్మానిస్తున్న ప్రజలు

ఏసీబీకి చిక్కిన శామీర్‌పేట తహసీల్దార్

● కరీంనగర్‌లోని ఇంటిలో సోదాలు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 13: శామీర్‌పేట తహసీల్దార్ తోడేటి సత్యనారాయణ మంగళవారం 10 లక్షల రూపాయలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ) పోలీసులకు హైదరాబాద్‌లో పట్టుబడ్డాడు. ఈ కేసుకు సంబంధించి కరీంనగర్‌లోని విద్యానగర్ ప్రాంతంలో సత్యనారాయణకు చెందిన ఇంటిలో కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు సోదాలు నిర్వహించి కొన్ని పత్రాలు సీజ్ చేశారు. సత్యనారాయణ భార్యను ఏసీబీ అధికారులు విచారించారు.


విద్యానగర్‌లోని శామీర్‌పేట తహసీల్దార్ నివాసంలో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు



అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 13: అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ మాస్టర్ అథ్లెట్ ఎ.మధుసూదన్(74) ఎంపికయ్యారు. ఈనెల 8 నుంచి 11వరకు హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఐదో జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో విశేష ప్రతిభచాటి అండర్-75 విభాగంలో ఐదు కిలోమీటర్ల వాకింగ్‌లో బంగారు పతకం, 400 మీటర్ల రిలే పరుగులో రజత పతకం సాధించిన ఆయన అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారని మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నీలం లక్ష్మన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పెరియాల రవీందర్‌రావు, సభ్యులు, వాకర్స్, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి కీర్తి రాజవీరు తదితరులు అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో అల్ఫోర్స్‌కు ర్యాంకులు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 13: అల్ఫోర్స్ ఐఐటీ అకాడమీ తెలంగాణ, మహారాష్ట్ర విద్యార్థులు ఐఐటీ జేఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్ష ఫలితాల్లో సత్తా చాటారు. బి.ఆదిత్యారావు, జి.శ్రీహాస్, సుబోద్‌చౌదరి, ఎం.శ్రీరాం, ప్రణీత్, నిఖిల్‌చోప్రా, ఎ.శివవరుణ్, సిహెచ్ అనూహ్య, పి.రఘువీర్‌రెడ్డి, సత్యఅమూల్య, షఫీక్, శివశంకరవరప్రసాద్, శ్రీనిధి, ఎం.ప్రహర్ష్, ఎం.పూనిత్ మనోహర్, రవిచంద్ర అద్భుతమైన పర్సంటైల్ సాధించారని అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి తెలిపారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'ఎస్ఆర్' ప్రభంజనం


డి.మనీష్


టి.తేజస్వి

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 13 : అత్యంత ప్రతిష్టాత్మకమైన జేఈఈ మెయిన్స్ 2024 (సీజన్-1) ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి తెలిపారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో జాతీయ స్థాయిలో దొంతుల మనీష్ 99.99 శాతం పర్సంటైల్ సాధించి ఎస్ఆర్ విద్యాసంస్థల కీర్తి ప్రతిష్ఠలను జాతీయస్థాయిలో నిలబెట్టినట్లు తెలిపారు. అలాగే తుమ్మ తేజస్వీ 99.95 శాతం, ఆర్.దీపాన్షరెడ్డి 99.19 శాతం, పి.నిహాల్ శ్రీవాత్సవ్ 99.91 శాతం సాధించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో అత్యుత్తమైన ర్యాంకులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను వరదారెడ్డి అభినందించారు.

ప్రతిభ చాటిన అలుగునూర్ ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు

తిమ్మాపూర్: జేఈఈ మెయిన్ ఫలితాల్లో కరీంనగర్ పరిధిలోని అలుగునూర్‌లో గల ఎస్ఆర్ జూనియర్ కళాశాలకు చెందిన 9 మంది విద్యార్థులు 90 పర్సంటైల్ సాధించి జాతీయ స్థాయిలో సత్తా చాటారని ఎస్ఆర్ విద్యా సంస్థల జోనల్ ఇంచార్జ్ నేదూరి తిరుపతి తెలిపారు. మంగళవారం కళాశాల ప్రాంగణంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కళాశాలకు చెందిన జి.రాజీవ్(99.2) పర్సంటైల్‌తో అత్యున్నత ప్రతిభ కనబరచగా, జి.శ్రీవాత్సవ్(98.5), ఎస్.వినూత్న(98.22), బి.రిషిత్(98), బి.క్షేత్ర(96.5), డి.రోహన్(96), ఏ.ఆశ్వక్(94.09),కె.ఒమేశ్వర్(92.21), వి.శ్రీహరిణి(90) పర్సెంటైల్ సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ నాగార్జునరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, మారుతి, శ్రీనివాస్‌రెడ్డి అధ్యాపకులు అభినందించారు.


కరీంనగర్‌లో విద్యార్థులను అభినందిస్తున్న ఎస్ఆర్ జోనల్ ఇన్‌చార్జి నేదూరి తిరుపతి

జేఈఈ మెయిన్స్‌లో ట్రినిటి ప్రతిభ


వర్షితరాణి


శ్రీతేజ

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 12: జేఈఈ మెయిన్స్ సెషన్-1 ఫలితాల్లో ట్రినిటి కళాశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. కళాశాల ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రినిటి విద్యాసంస్థల ఫౌండర్ అండ్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రణాళికతో, అకుంఠిత దీక్షతో ఉత్తమ ఫలితాలు సాధించామన్నారు. ఫలితాల్లో వర్షితరాణి 99.53 పర్సంటైల్, వి.శ్రీతేజ 98.49 పర్సంటైల్, ఎం.మణితేజ 97.75 పర్సంటైల్ సాధించారన్నారు. మరెన్నో ఉత్తమమైన ఆమోదయోగ్యమైన ఫలితాలు సాధించామన్నారు. ఒత్తిడి లేని విద్యా విధానంతో చక్కని ప్రణాళికతో విద్యను అందిస్తున్నామన్నారు.

ప్రజాస్వామ్య ప్రక్రియను నిలబెట్టడమే కాంగ్రెస్ లక్ష్యం

● ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 13: ప్రజాస్వామ్య ప్రక్రియను నిలబెట్టడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల్లో సామాజికంగా మహిళలకు ప్రాధాన్యత కల్పించాలని ఆనాడు స్వర్గీయ రాజీవ్ గాంధీ ఆధ్వర్యంలో 73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా మూడవ వంతు రిజర్వేషన్ కల్పించారన్నారు. స్థానిక సంస్థల్లో ఏ పదవి ఖాళీ అయినా దానిని ఆరు నెలల్లో ఎన్నిక ద్వారా భర్తీ చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందన్నారు. కానీ జగిత్యాలలో మాత్రం ఇవేమీ పాటించకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం కాలం గడిపిందన్నారు. జగిత్యాల రూరల్ ఎంపీపీ కరోనాతో మృతి చెందగా, జగిత్యాల బల్దియా చైర్ పర్సన్ బోగ శ్రావణి తన పదవితో పాటు కౌన్సిలర్ పదవికి రాజీనామా చేయడంతో పదవులు ఖాళీ అయినా ఆ స్థానాలకు ఎన్నిక నిర్వహించకపోవడంతో మహిళలకు కేటాయించిన రిజర్వేషన్ హక్కులు కోల్పోతున్నారన్నారు. బీసీలకు కేటాయించిన సీట్లలో ఉన్నత వర్గాలకు చెందిన వారు కొనసాగుతుండడంతో బీసీలు తమ హక్కులను కోల్పోతున్నారన్నారు. పీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, బండ శంకర్ ఉన్నారు.

ఖాతాదారుల డబ్బులు కాజేస్తున్న సైబర్ మోసగాళ్లు

● ధర్మారం మండలంలో వరుస ఘటనలు
● తాజాగా రూ.29,500 డ్రా

ధర్మారం,ఫిబ్రవరి13: సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాదారులపై కన్నేశారు. బ్యాంకులో డబ్బులున్నాయని అవసరానికి తీసుకుందామని వెళ్తే ఖాతా ఖాళీకావడంతో అవాక్కవుతున్నారు. తమకు తెలియకుండా డబ్బులు డ్రా చేశారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలోని ధర్మారం మండలం నందిమేడారంలో సందినేని పవన్‌కుమార్ ఎస్‌బీఐ ఖాతాలో నుంచి అతనికి తెలియకుండానే రూ. 10వేలు డ్రా కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. తాజాగా మంగళవారం మరో మోసం కేసు నమోదైంది. ధర్మారం మండలంలోని బొట్లవనపర్తి గ్రామానికి చెందిన దారవేని పోచాలు ఎస్‌బీఐ ఖాతా నుంచి మూడు విడతలుగా ఏఈపీఎస్(ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్) ద్వారా రూ.29వేల 500లను సైబర్ నేరగాళ్లు డ్రా చేసినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన ఖాతా నుంచి తనకు తెలియకుండా గత ఏడాది డిసెంబరు31న రూ.10వేలు, ఈ ఏడాది జనవరి 2న రూ. 9వేల 500, జనవరి 4న రూ.10వేలు మొత్తం రూ. 29వేల 500 డ్రా జరిగినట్టు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వివరించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

విచారణ చేస్తున్న పోలీసులు

ధర్మారం మండలంలో ఇద్దరి ఎస్‌బీఐ ఖాతాలో నుంచి రూ.39వేలను వేర్వేరు తేదీలలో సైబర్ నేరగాళ్లు డ్రా చేయడంతో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఒక వైపు సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా ప్రజలు ఎక్కడో ఒకచోట మోసపోతూనే ఉన్నారు. సైబర్ నేరగాళ్లు పోలీసులకు సవాలు విసురుతున్నారు. ఇటీవల ఎక్కువగా భూముల రిజిస్ట్రేషన్ చేసే సమయంలో వేలిముద్రలను ఉపయోగిస్తుండడంతో ఆ కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. అంతే కాకుండా కంప్యూటర్ సెంటర్‌లలో కూడా ఎవరైనా ఈ నేరాలకు పాల్పడుతున్నారా? అనే కోణంపై పోలీసులు దృష్టి సారించారు. బ్యాంకు ఖాతాల్లో భద్రంగా డబ్బులుంటాయని నమ్మకం లేకుండా సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలకు బ్యాంకు ఖాతాదారులు భయాందోళన చెందుతున్నారు. మోసాలపై పోలీసులు విచారణ వేగవంతం చేశారు.

రైతుబంధు పేరుతో మోసం

కొడిమ్యాల, ఫిబ్రవరి 13: మండలంలోని నాచుపల్లిలో సోమవారం జరిగిన ఆన్‌లైన్ మోసంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి ఖాతా నుంచి రూ.1.25 లక్షలు మోస పోయారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు నాచు పల్లి గ్రామానికి చెందిన గాజర్ల సౌమ్యకు రైతు బంధు డబ్బులు 21 వేలు మంజూరయ్యాని గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బ్యాంక్ వివరాలు కోరాడు. వివరాలు అందు బాటులో లేకపోవటంతో ఇంటి పక్కనే ఉన్న సంధ్య అనే మహిళ బ్యాంక్ వివరాలను సదరు వ్యక్తికి తెలిపింది. బ్యాంక్ ఖాతాకు పూర్తి వివరాలు సరిపోవటం లేదని మళ్లీ ఫోన్ రావటంతో సంధ్య కుటుంబ సభ్యులైన సుమన్, రమేష్‌కు చెందిన బ్యాంక్ వివరాలు తెలిపారు. కొద్ది సేపటికి ముగ్గురి ఖాతాలో నుంచి రూ.1,25,408 రూపాయలు కట్ అయ్యాయి. మోసపోయినట్లు గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

విద్యుత్ కంచె అమర్చిన వ్యక్తి రిమాండ్

రుద్రంగి, ఫిబ్రవరి 13: అటవీ జంతువుల వేట కోసం విద్యుత్ తీగలు అమర్చిన గుగులోతు తిరుపతిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రుద్రంగి మండలం రూప్లా నాయక్ తండా శివారులోని గుగులోతు తిరుపతి పంటకు విద్యుత్ కంచె ఏర్పాటు చేశాడు. దీంతో హరిసింగ్ అనే రైతుకు చెందిన గేదె కంచెకు తగలడంతో విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. హరిదాస్ ఫిర్యాదుతో తిరుపతిపై ఆదివారం కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం మంగళవారం తిరుపతిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా పొలాలకు విద్యుత్ కంచెలను అమరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బోయినపల్లి, ఫిబ్రవరి 13: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బోయినపల్లి మండలం వరదవెల్లి గ్రామానికి చెందిన రాజనర్సు (60) మంగళవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. గ్రామానికి చెందిన రాజనర్సు (60), శివయ్య, అనంత రెడ్డి ఈ నెల 8న కూలి పని కోసం వరదవెల్లి వచ్చారు. రోడ్డు పక్కన ముగ్గురు మాట్లాడుకుంటుండగా పెగడపల్లి మండలం బత్కపల్లికి చెందిన మారుతి కారు అతివేగంగా వచ్చి ముగ్గురిని ఢీకొట్టింది. ముగ్గురికి గాయాలు కాగా రాజనర్సు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పెగడపల్లి, ఫిబ్రవరి 13: పెగడపల్లి మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన పొన్నం లచ్చయ్యకు చెందిన గేదె మంగళవారం విద్యుదాఘాతంతో మృత్యువాత పడింది. ఇంటి ముందు స్తంభానికి కట్టివేసిన గేదెపై ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తెగిపడి మృతి చెందినట్లు గ్రామస్థులు, బాధిత రైతు తెలిపారు. రూ.50 వేలు విలువ చేసే గేదె మృత్యువాత పడటంతో బాధిత రైతు కన్నీరు మున్నీరుగా విలపించారు. రైతుకు ప్రభుత్వం విద్యుత్ శాఖ పరిహారం అందించి ఆదుకోవాలని ఎంపీటీసీ పూసాల శోభాతిరుపతి, రైతులు కోరారు.



పిల్లలు పుట్టడం లేదని ఆత్మహత్య


సల్లె రమేష్(ఫైల్)

సుల్తానాబాద్, ఫిబ్రవరి 13: వివాహం జరిగి ఎనిమిది సంవత్సరాలు కావస్తున్నా పిల్లలు పుట్టడం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు రైల్వేట్రాక్ పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ముట్టుకుని మంగళవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వినీత తెలిపారు. సుల్తానాబాద్‌కు చెందిన సల్లె రమేష్ (33)కు స్రవంతితో వివాహం జరిగి ఎనిమిది సంవత్సరాలు అవుతోంది. అయితే వీరికి సంతానం లేకపోవడంతో మనస్తాపం చెందిన రమేష్ మద్యంకు బానిసగా మారాడు. ఇంట్లో తల్లి, అతని భార్య తాగుడు వద్దని చెప్పినా పెడచెవిన పెట్టేవాడు. మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిన రమేష్ మద్యం తాగి ఇంటికి రాగా తల్లి సమ్మక్క మందలించడంతో ఇంటి వెనకాల రైల్వే ట్రాక్ పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ వివరించారు. మృతునికి భార్య స్రవంతి, తల్లి సమ్మక్క ఉన్నారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుల్తానాబాద్ ప్రభుత్వ అసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..

వెల్గటూర్, ఫిబ్రవరి 13: ఆర్థిక ఇబ్బందులు తాళలేక తాళ్లకొత్తపేట గ్రామా నికి చెందిన ఎల్కటూరి లక్ష్మీనారాయణ (35) అనే వ్యక్తి సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు లక్ష్మీనారాయణ గత కొద్ది రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడు తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య సౌందర్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చిన్నకల్వలలో యువకుడు..


సుధీర్‌రావు (ఫైల్)

సుల్తానాబాద్, ఫిబ్రవరి 13: సుల్తానాబాద్ మండలంలోని చిన్నకల్వల గ్రామంలో గౌరవెల్లి సుధీర్‌రావు (30) అనే యువకుడు మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.ఇంట్లో ఎవరూ లేని సమయంలో సుధీర్‌రావు మంగళవారం ఉదయం ఉరి వేసుకోవడంతో సాయంత్రం సంఘటన వెలుగు చూసింది. భార్య అవణి కొన్నిరోజుల క్రితం అమె పుట్టింటికి వెళ్లింది. తల్లి స్వర్ణ అలియాస్ పద్మ సుగ్లాంపల్లిలో అంగన్ వాడీ టీచర్‌గా పనిచేస్తోంది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో సుధీర్‌రావు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాలు తెలియాల్సి ఉంది. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

కష్టపడే వారికి బీజేపీ ఎంపీ టికెట్ ఇవ్వండి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేరుగు హన్మంతుగౌడ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మేరుగు హన్మంతుగౌడ్

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 13: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ టికెట్‌ను కష్టపడి పార్టీ కోసంపని చేసే వారికి ఇవ్వాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేరుగు హన్మంతుగౌడ్ అధిష్ఠానాన్ని కోరారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలు నిరుత్సాహంగా ఉన్నారని, ఇప్పటికైనా పార్టీ జెండా మోసే వారికి టికెట్ ఇవ్వాలని కోరారు. క్యాతం వెంకటరమణ పార్టీ కోసం చిన్న నాటి నుంచి కష్టపడుతున్నాడని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అతనికి టికెట్ కేటాయించాలని కోరారు. దీన్ దయాల్ ఉపాధ్యాయ సిద్ధాంతం ప్రకారం మానవతా ఏకత్వం అనే నినాదంతో ఈ సారి పెద్దపల్లి పార్లమెంట్ టికెట్ కొత్తగా వచ్చిన వారికి కాకుండా పార్టీ కోసం కష్టపడే వారికి ఇస్తే గెలిపించుకుంటామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు పెద్దపల్లి రవీందర్, క్యాతం వెంకటరమణ, సుల్వ లక్ష్మీనర్సయ్య, జక్కుల నరహరి, చంద్రశేఖర్, సమ్మయ్య, రామకృష్ణ, సాగర్, మల్లిక్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ఎంపీ టికెట్ శంకర్‌కు ఇవ్వాలి'

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 13: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ టికెట్ న్యాయవాది కొప్పుల శంకర్‌కు ఇవ్వాలంటూ కాంగ్రెస్ లీగల్ సెల్ వైస్ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, వేల్పుల మురళీధర్‌యాదవ్ రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 30సంవత్సరాలుగా కాంగ్రెస్‌లో పని చేస్తున్న కొప్పుల శంకర్ కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పని చేస్తున్నారని, న్యాయవాదిగా కొనసాగుతున్న కొప్పులకు ఈ సారి అవకాశం ఇస్తే న్యాయవాదులంతా కలిసి గెలిపించుకుంటామని, టికెట్ శంకర్‌కు ఇవ్వాలని వారు కోరారు. ఈ విలేకరుల సమావేశంలో న్యాయవాదులు తాజుద్దీన్‌బాబా, ముష్కె రవికుమార్, సతీష్‌కుమార్, చిదురాల రమేష్, గొట్టె నరేష్, బాస అనురాధ పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి



ఎన్టీపీసీ ప్లాంటు వద్ద కరపత్రాలు పంపిణీ చేస్తున్న జేఏసీ నాయకులు

జ్యోతినగర్, ఫిబ్రవరి 13 : ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను రామగుండం ప్రాంతంలో విజయవంతం చేయాలని ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కోరారు. సమ్మెకు సంబంధించి మంగళవారం జేఏసీ ఆధ్వర్యంలో ఎన్టీపీసీ ప్లాంటు గేటు వద్ద కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. రోజు రోజుకు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ మోదీ సర్కారు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. కనీసం నెలకు 26 వేల రూపాయల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూడా కనీస వేతనాలకు సంబంధించి ప్రతి ఐదేళ్లకొకసారి సవరించాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. గత 10 ఏళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం కనీస వేతనాల సవరణ చేయకుండా కార్మిక ద్రోహానికి పాల్పడిందని వారు ఆరోపించారు. అలాగే కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కాలపరిమితి ముగిసినప్పటికీ కనీస వేతనాల జీవోలు విడుదల చేయడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక కుటుంబాలను ఆర్థికంగా ఇబ్బందులపాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న దేశవ్యాప్త సమ్మె చేస్తున్నామని, ఈ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు నాంసాని శంకర్, గీట్ల లక్ష్మారెడ్డి(సీఐటీయూ), చిలుక శంకర్, నాగభూషణం(ఐఎఫ్‌టీయూ), ఇ.భూమయ్య, చింతల సత్యం(బీఆర్‌ఎస్), శ్రీనివాస్(టీఎన్‌టీయూసీ), రాజమల్లయ్య(గోదావరి యూనియన్), లక్ష్మణ్(ఏఐటీయూసీ), సత్యనారాయణ(ఐఎన్‌టీయూసీ), డి.సత్యం (హెచ్‌ఎంఎస్) పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కోల్‌సిటీ టౌన్, ఫిబ్రవరి 13 : గోదావరిఖనిలోని గాంధీ డిగ్రీ కళాశాలలో మంగళవారం సైబర్ క్రైమ్ డీఎస్పీ డాక్టర్. డి.రాజేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ సీఐ కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులకు, సిబ్బందికి సైబర్ నేరాలు జరిగే విధానంపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు గురి కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై తెలియజేశారు. సైబర్ నేరానికి గురి అయితే వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేయాలని లేదా సైబర్ క్రైం.గవ్‌ట్.ఇన్ లో ఫిర్యాదు చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో గాంధీ డిగ్రీ కళాశాల విద్యార్థులు, సిబ్బంది, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, యు.కుమార్, కీర్తి, వెంకటేష్, ఓ. శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

రామగుండం మెడికల్ కళాశాలలో ర్యాగింగ్

- ఇద్దరు విద్యార్థులకు గుండు చేసిన సీనియర్ విద్యార్థులు - జూనియర్ విద్యార్థుల ఆందోళన

- నలుగురు విద్యార్థులపై ఫిర్యాదు - పోలీసుల విచారణ

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 13: రామగుండం మెడికల్ కళాశాల ర్యాగింగ్ భూతం కలకలం రేపింది. సోమవారం రాత్రి సీనియర్ విద్యార్థులు ఇద్దరు జూనియర్ విద్యార్థులపై ర్యాగింగ్‌కు పాల్పడ్డారు. కళాశాలలోని హాస్టల్‌లో మెడికల్ మొదటి సంవత్సరం చదువుతున్న ఇద్దరు జూనియర్ విద్యార్థులను వేధిస్తూ ర్యాగింగ్‌కు పాల్పడ్డారు. ఇద్దరి విద్యార్థుల తల వెంట్రుకలు ఎందుకు పెంచుతున్నావంటూ ట్రిమ్మర్‌తో గుండు చేసి, మీసాలు తొలగించారు. హాస్టల్‌లో మూకుమ్మడిగా సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థుల గదుల్లోకి చొరబడి వీరితో పాటు మరో ముగ్గురిని కూడా ర్యాగింగ్ చేశారు. ఈ సంఘటనపై విద్యార్థులు తమ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ర్యాగింగ్‌తో భయంతో ఇద్దరు విద్యార్థులు తమ ఇండ్లకు వెళ్లిపోయారు. ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం జూనియర్ విద్యార్థులు వైస్ ప్రిన్సిపాల్ చాంబర్ ఎదుట ఆందోళనకు దిగారు. సీనియర్లు జూనియర్లను పలు విషయాల్లో వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. సీనియర్ విద్యార్థులను తాము ఎప్పుడూ గౌరవిస్తూ ఉంటామని, వారిని సార్, మేడం అని పిలిచినప్పటికీ తమను ర్యాగింగ్ చేయడం సరికాదన్నారు. విషయం తెలుసుకున్న గోదావరిఖని వన్‌టౌన్ ఎస్‌ఐ శరణ్య కళాశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. సీనియర్లపై చర్యలు తీసుకోవాలంటూ బాధిత విద్యార్థులు ప్రిన్సిపాల్ హిమబిందుకు ఫిర్యాదు చేశారు. కళాశాలలో ర్యాగింగ్ భూతాన్ని తరమిరికొట్టాలని జూనియర్ విద్యార్థులు నిరసనకు దిగారు. తమకు ఇంకా ఎలాంటి ఫిర్యాదు రాలేదని వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు తెలిపారు.



ఆందోళన చేస్తున్న జూనియర్ విద్యార్థులు

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం...

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు

ర్యాగింగ్‌కు పాల్పడిన నలుగురు విద్యార్థులపై జూనియర్ విద్యార్థులు ఫిర్యాదు చేశారని, విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపాల్ హిమబిందు పేర్కొన్నారు. ర్యాగింగ్‌పై కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

పోటీ పరీక్షల ద్వారా విద్యార్థుల్లో మేధాశక్తి : డీఈవో



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న డీఈవో మాధవి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 13: పాఠశాలల్లో నిర్వహించే పోటీ పరీక్షల ద్వారా విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందుతుందని జిల్లా విద్యాధికారి మాధవి అన్నారు. మంగళవారం మండలంలోని అప్పన్నపేట లయన్ భవన్‌లో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ఆధ్వర్యంలో జిల్లాలోని 14 మండలాల జిల్లా పరిషత్, కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులకు డ్రామా, స్పెల్‌విజర్డ్‌పై పోటీలు నిర్వహించారు. మండలాల్లో నిర్వహించగా అందులో గెలుపొందిన వారికి జిల్లా స్థాయిలో నిర్వహించారు. డ్రామా కాంపిటీషన్‌లో కేజీబీవీ పాఠశాలల నుంచి మొదటి స్థానంలో కేజీబీవీ అంతర్గం, స్పెల్ విజర్డ్‌లో మొదటి స్థానం కేజీబీవీ అంతర్గాం, జిల్లా పరిషత్ పాఠశాలల విభాగంలో నందిమేడారం పాఠశాలకు చెందిన జ్యోషిత (8వ తరగతి) ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లా పరిషత్ డ్రామా విభాగంలో జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మంథని మొదటి స్థానంలో నిలిచారు.

గెలుపొందిన విద్యార్థులను ఉమ్మడి కరీంనగర్ స్థాయిలో ఫిబ్రవరి 19న జరిగే పోటీలో పాల్గొంటారని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు డీఈవో బహుమతులు, ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి షేక్, ఎల్టా జిల్లా అధ్యక్షుడు అశోక్, అప్పన్నపేట జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం, మండల నోడల్ అధికారి ఆగయ్య, జగదీశ్వర్‌లు పాల్గొన్నారు.

మీర్జంపేటలో సమ్మక్క-సారలమ్మ జాతరకు ఏర్పాట్లు

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 13: మండలంలోని మీర్జంపేట గ్రామంలో గల సమ్మక్క - సారలమ్మ జాతర ముస్తాబవుతోంది. మీర్జంపేట శివారులోని మానేరు ఒడ్డున గత 50 సంవత్సరాలు గ్రామస్థులు గ్రామ కమిటీ ద్వారా జాతర నిర్వహిస్తుంటారు. ఈ జాతరకు మండల కేంద్రంతో పాటు సుమారు 20 గ్రామాల ప్రజలు, ఓదెల మంలంలోని పెద్ద కొమిరే, పొత్కపల్లి, గూడెం, గుంపుల, ఇందుర్తి గ్రామస్థులతో పాటు జమ్మికుంట మండలం వావిలాల, నగరం, భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం ఎంచపెల్లి, బోర్నపల్లి, ఎల్లంపల్లి తదితర గ్రామాలన ఉంచి భక్తులు సుమారు రెండు లక్షల మంది మీర్జంపేట సమ్మక్క - సారలమ్మ జాతరకు వస్తుంటారు. కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రానికి సుమారు 7కిలోమీటర్ల దూరంలో ఉన్న మీర్జంపేట సమ్మక్క-సారలమ్మ జాతరకు జమ్మికుంట, గోదావరిఖని నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యాలు ఉన్నాయి. తారుపెల్లి నుంచి మీర్జంపేట వరకు ఇటీవల డబుల్ రోడ్డు నిర్మాణం కూడా పూర్తయ్యింది. దీంతో సమ్మక్క - సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు రహదారి అంతా తారు రోడ్డు కావడంతో చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చే భక్తులకు ప్రయాణానికి సులువు మార్గం ఏర్పడింది. సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే భక్తుల కోసం జాతర కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.



మీర్జంపేట సమ్మక్క - సారలమ్మ గద్దెలు

సమ్మక్క - సాలరమ్మ జాతర పక్కనే మానేరు ఉండడంతో తాగునీటికి, భక్తుల స్నానాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్ సౌకర్యంతో పాటు జాతరకు వచ్చే దారిలో కమాన్ నుంచి జాతర వరకు ఒక కిలోమీటర్ మేర మొరం వేసి రోడ్డు చదును చేశారు. గ్రామంలోని జాతర కమిటీ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

బొగ్గును అక్రమంగా తరలిస్తున్న లారీ పట్టివేత



బొగ్గు లారీని పట్టుకున్న అధికారులు

మంథనిరూరల్, ఫిబ్రవరి 13: మండలం కన్నాల గ్రామ శివారులోని ఇటుకబట్టీ లోకి అక్రమంగా బొగ్గు తరలిస్తుండగా సింగరేణి విజిలెన్స్, సెక్యూరిటీ సిబ్బంది మంగళవారం పట్టుకున్నారు. సింగరేణి సెక్యూరిటీ అధికారి లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... భూపాల్‌పల్లి కేటీకే ఓసీపీ-3 నుంచి ఆర్జీ-3 ఏరియాలోని ఓసీపీ-1కు బొగ్గు రవాణా కొనసాగుతోంది. ఈక్రమంలో బొగ్గు దొంగలు లారీలో రవాణా చేస్తున్న బొగ్గును ఓసీపీ-1లో అన్లోడ్ పూర్తిగా చేయకుండా కొంత చేసి మిగతా బొగ్గును ఇటుక బట్టీలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గత కొంత కాలంగా గుట్టు చప్పుడు కాకుండా కొనసాగుతున్న బొగ్గు దొంగ రవాణాపై విజిలెన్స్ అధికారులు నిఘా పెట్టి పట్టుకున్నారు. కన్నాల గ్రామ శివారులోని ఇటుక బట్టీకి రెండు లారీల్లో బొగ్గు తరలిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. రెండు లారీల్లో సుమారు 10టన్నుల బొగ్గు ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా ఇటుక బట్టీ లో నిల్వ ఉన్న సుమారు 200 టన్నుల బొగ్గును గుర్తించి సీజ్ చేశారు. మొత్తం బొగ్గు విలువ సుమారు రెండు లక్షల రూపాయలు ఉంటుందని సింగరేణి అధికారులు తెలిపారు.



సంస్థ అభివృద్ధికి పాటుపడాలి : ఏపీఏ జీఎం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు

రామగిరి, ఫిబ్రవరి 13: సింగరేణి ఉద్యోగం లభించడం అదృష్టంగా భావించాలని, ప్రతి ఉద్యోగి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఎంవీటీసీ కార్యాలయంలో డిపెండెంట్ ఉద్యోగాలు పొందిన 178 మంది అభ్యర్థులకు ఎంవీటీసీ శిక్షణ కోసం ఏర్పాటు చేసిన సమావేశానికి ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణిలో ఉద్యోగం ఒక వరంలాంటిదని క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. నిత్యం విధులకు హాజరుకావాలని పేర్కొన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సంస్థలో ఉన్నతస్థాయి ఉద్యోగాలు సాధించడానికి అవకాశం ఉన్న నేపథ్యంలో పదోన్నతులపై దృష్టి సారించాలని తెలిపారు. ప్రతి ఉద్యోగి సింగరేణి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ సమావేశంలో అధికారులు రవీందర్‌రెడ్డి మల్లన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై పోరాటం చేసిన మొండయ్య

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 13: కార్మిక సమస్యలపై ఐఎన్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసరి మొండయ్య ఎనలేని కృషి చేశారని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఐ కృష్ణ అన్నారు. మొండయ్య 21వ వర్ధంతి సందర్భంగా గాంధీనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గని కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్మికవర్గాన్ని చైతన్యవంతం చేసి ఉద్యమాల వైపు, పోరాటాల వైపు మళ్లించారని, బాయిదొరల జులుంకు వ్యతిరేకంగా ప్రభుత్వ నిర్బంధానికి ఎదురునిలిచి పోరాడిన వ్యక్తి మొండయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఈదునూరి నరేష్, అశోక్, రవికుమార్, కొమురయ్య, లింగమూర్తి, ధర్మేందర్, చంద్రయ్య, సాంబయ్య, అజీమొద్దీన్, రాజన్న, అయూబ్‌ఖాన్, శ్రీకాంత్, శ్రావణ్, రాజు పాల్గొన్నారు.



మొండయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఉద్యోగులు సమ్మెకు దూరంగా ఉండాలి

- ఆర్జీ-3 జీఎం సూర్యనారాయణ

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 13: జాతీయ సంఘాలు ఈనెల 16న తలపెట్టిన ఒక్క రోజు సమ్మెకు ఆర్జీ-2 ఏరియా ఉద్యోగులు దూరంగా ఉండాలని జీఎం సూర్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ఆర్థిక సంవత్సరం దగ్గరపడుతున్న క్రమంలో ఉత్పత్తి లక్ష్యాలు సాధించే దిశగా సింగరేణి పయనిస్తున్నదని, ఇటువంటి తరుణంలో సమ్మె చేయడంవలన ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నట్టు జీఎం ప్రకటనలో పేర్కొన్నారు. ఒకరోజు సమ్మెతో సింగరేణి ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా ఉద్యోగులు వేతనాలు కోల్పోయి నష్టపోతారని పేర్కొన్నా రు. కార్మిక సంఘాలు పెట్టిన డిమాండ్లు సింగరేణి పరిధిలోవి కాదని, సింగరేణి పరిష్కరించేవి కాదని అన్నారు. డిమాండ్లు అన్ని కేంద్ర ప్రభుత్వ పరిధిలో అంశాలని జీఎం తెలిపారు. విజ్ఞులైన ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు సంస్థ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సమ్మెకు దూరంగా ఉండాలని జీఎం కోరారు. వార్షిక సంవత్సర ముగియడానికి 50 రోజుల సమయం మాత్రమే ఉన్నందున యధావిధిగా విధులకు హాజరై ఉత్పత్తి సాధించి లక్ష్యాన్ని చేరుకోవడంలో ఉద్యోగులు యాజమాన్యానికి సహకరించాలని జీఎం సూర్యనారాయణ విజ్ఞప్తి చేశారు.

కార్మికులకు హెచ్‌ఆర్‌ఏ చెల్లించాలి

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 13: మందమర్రి ఏరియాలోని కేకే ఓసీలో పనిచేస్తున్న కార్మికులకు హెచ్‌ఆర్‌ఏపై బేసిక్‌9 శాతం చెల్లించాలని, లేని పక్షంలో ఆందోళన చేపడుతామని ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మర్రి కుమారస్వామి హెచ్చరించారు. మంగళవారం గుర్తింపు సంఘం ఆధ్వర్యంలో పలు సమస్యలపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మందమర్రి మున్సిపాలటీ పరిధిలో ఉన్న కేకే ఓసీలో పనిచేస్తున్న వారికి ఇంతవరకు బేసిక్‌పై 9శాతం చెల్లించలేదన్నారు. ఎన్నో నెలలుగా డిమాండ్ చేస్తున్నా యాజమాన్యం పెడచెవిన పెడుతోందన్నారు. యాజమాన్యం సమస్యలపై పరిష్కారానికి చర్యలు తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అంద జేశారు.

దేశవ్యాప్త సమ్మెకు మద్దతు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 13: కార్మిక సంఘాల జేఏసీ పక్షాన ఈనెల16న నిర్వహించే సమ్మెకు తాము పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రాంచందర్‌రావు, ప్రధానకార్యదర్శి బూపెల్లి బానయ్య, ఉపప్రధానకార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

సబ్‌స్టేషన్ నిర్మాణ స్థలం పరిశీలన

ధర్మారం, ఫిబ్రవరి13: ధర్మారం మండలం కటికెనపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ స్థలాన్ని మంగళవారం విద్యుత్ అధికారులు పరిశీలించారు. సబ్‌స్టేషన్ నిర్మించే స్థలంలో వారు కొలతలు తీసుకున్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఏడీఈ కనకయ్య, సివిల్ ఏఈ సమ్మయ్య, లైన్‌మన్ పవన్, కాంగ్రెస్ నాయకుడు రేండ్ల నరేష్ తదితరులు ఉన్నారు.

ఐకేపీ ఆధ్వర్యంలో అన్నదానం

సుల్తానాబాద్, ఫిబ్రవరి 13: సుల్తానాబాద్ పట్టణంలో ఐకేపీ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో దివ్యాంగులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో యువకులు గడ్డం అనిల్‌గౌడ్, యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షులు తుమ్మ రాజ్‌కుమార్, తుమ్మ లక్ష్మీనారాయణ, పిట్టల రమేష్, మేకల రాజకొమురయ్య, కృతిక తదితరులు పాల్గొన్నారు. నాలుగైదు రోజుల క్రితం ఒక మతి స్థిమితం లేని వ్యక్తి పట్టణంలో సంచరిస్తూ రోడ్డు పక్కన పడేసిన కుళ్లిన ఆహారాన్ని తినడాన్ని చూసిన యువకులు రాజ్‌కుమార్ తదితరులు అతనికి భోజనం అందిస్తు తమ ఔదారాన్ని చాటుకున్నారు.

'పెద్దపల్లి ఎంపీ టికెట్ మాదిగలకు కేటాయించాలి'

సుల్తానాబాద్, ఫిబ్రవరి 13: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ టికెట్‌ను ఈసారి మాదిగలకు కేటాయించాలని మాదిగ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన మాదిగ ఐక్యవేదిక నాయకులు మంగళవారం సుల్తానాబాద్‌లో సమావేశమై అన్ని ప్రముఖ పార్టీల బాధ్యులను డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయా పార్టీల రాష్ట్ర కమిటీ అధ్యక్షులకు, జాతీయ కమిటీ బాధ్యులు వినతపత్రాలు పంపించారన్నారు. సమావేశంలో నాయకులు బాపయ్య, విజయ ప్రభాకర్, సదానందం, న్యాతరి ప్రభాకర్, సంకెనపల్లి లక్ష్మణ్, తిరుపతి, శంకర్, మల్లేశం, బాణయ్య, పోశం, బీంరావు, భూమయ్య, మంథని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క జాతరకు విరాళం అందజేత

ధర్మారం,ఫిబ్రవరి13: మండల కేంద్రంలో ఈనెల 21 నుంచి 24వరకు జరిగే సమ్మక్క-సారక్క జాతరకు మంగళవారం ధర్మారం మాజీ సర్పంచ్ దేవి పద్మ-జనార్దన్ దంపతులు రూ.25వేల విరాళాన్ని నిర్వాహకులకు అందజేశారు. విరాళాన్ని అందించిన మాజీ సర్పంచ్ దేవి పద్మ-జనార్దన్‌కు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఓదెల ఎంపీడీవో బదిలీ

ఓదెల, ఫిబ్రవరి 13 : మండల అభివృద్ధి అధికారి సత్తయ్య మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లాకు బదిలీ అయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీగా ఐదేళ్లు, అలాగే నాలుగేళ్లు ఎంపీడీవో విధులు నిర్వహించారు. ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా ఎంపీడీవోగా రిలీవ్ అయ్యారు. ఇన్నాళ్లుగా సక్రమంగా విధులను నిర్వహించేందుకు సహకరించిన ప్రజలు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 13: ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.లక్ష్మీనర్సయ్య పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో 2024-25 విద్యాసంవత్సరానికి గాను విద్యార్థులు చేరేందుకు ప్రచారంలో భాగంగా వాల్ పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 13: తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ టీ సాక్స్, నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వైద్య అధికారి ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలో ఎయిడ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద జన జాగృతి వేదిక గడ్డం రమేష్ కళాబృందం ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై కళాజాతా బృందం నాటికలు, పాటల ద్వారా అవగాహన కల్పించారు.

దివ్యాంగులకు ఉచిత శిక్షణ

ఎలిగేడు, ఫిబ్రవరి 13: సదరన్ సర్టిఫికెట్ ఉన్న దివ్యాంగులకు డాటా ఎంట్రీ ఆపరేటర్స్ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు శ్రీవాణి కాలేజ్ ప్రిన్సిపాల్ బండారి కమలాకర్ తెలిపారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్కిల్ ఇండియాలో భాగంగా స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, స్కిల్ కౌన్సిల్ ఫర్ పర్సన్స్ విత్ డిసేబులిటీ వారి అనుమతితో గన సొసైటీ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన సదరన్ సర్టిఫికెట్ గల దివ్యాంగులకు 45రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. వారికి ఉచిత హాస్టల్, దివ్యాంగుల కోర్సు సర్టిఫికెట్, స్కాలర్‌షిప్ సౌకర్యం ఉందన్నారు. వివరాలకు 9642582185 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

చికెన్ సెంటర్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజ్‌కుమార్

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 13: చికెన్ సెంటర్ల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, పెద్దపల్లి ఎస్‌ఐలు అన్నారు. యజమానులతో మంగళవారం మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, పెద్దపల్లి ఎస్‌ఐలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చికెన్ సెంటర్ యజమానులు నాణ్యమైన చికెన్ ప్రజలకు అందించాలన్నారు. చికెన్ సెంటర్లలో పరిశుభ్రత పాటించాలన్నారు. వ్యర్థాలను ఇటుక బట్టీ కార్మికులకు గాని ఇతరులకు గాని విక్రయించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధిస్తామని వారు హెచ్చరించారు. వ్యర్థాలను మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి అందించాలన్నారు. మున్సిపల్ సిబ్బంది చికెన్ సెంటర్లలో తనిఖీలు నిర్వహిస్తారన్నారు. తహసీల్దార్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ చికెన్ వ్యర్థాలను విక్రయించినట్లయితే చికెన్ సెంటర్ యజమానులపై పీడీయాక్ట్ నమోదు చేస్తామన్నారు. ఎస్‌ఐ మల్లేష్ మాట్లాడుతూ చికెన్ సెంటర్ యజమానులు ఇష్టానుసారంగా వ్యర్థాలను విక్రయించినట్లయితే క్రిమినల్ కేసులు పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రమాకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రామ్మోహన్‌రెడ్డి, పులిపాక రాజు, బొంగోని అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి చేయూత

పాలకుర్తి, ఫిబ్రవరి13: మండల పరిధిలోని ఫ్యూచర్ గ్లోబల్ స్కూల్ యాజమాన్యం వృద్ధాశ్రమానికి చేయూత అందించింది. మంగళవారం నస్పూర్ ఆర్‌కె 5 కాలనీకి చెందిన శ్రీసాయి అనాథ వృద్ధాశ్రమానికి చందాలు పోగుచేసి తమ వంతు సహాయంగా 20,024రూపాయలను అందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సత్యం మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే వృద్ధులకు, అనాథలకు చేయూతను అందించడం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీష్ పాల్గొన్నారు.

ఏఎంసీ కమిటీని రద్దు చేసిన ప్రభుత్వం

మంథని, ఫిబ్రవరి 13: మంథని వ్యవసాయ మార్కెట్ కమిటీని రద్దు చేశారు. మంథని వ్యవసాయ మార్కెట్ కమిటీని రద్దు చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. దీంతో చైర్మన్ ఎక్కటి ఆనంతరెడ్డి, వైస్ చైర్మన్ ఘట్టపాక శ్రీనివాస్ యాదవ్, డైరెక్టర్లు పదవులను కోల్పోయారు. వీరి స్థానంలో ప్రత్యేక అధికారులను సైతం ప్రభుత్వం నియమించింది.

కల్యాణానికి ముస్తాబైన ఆలయం

పాలకుర్తి, ఫిబ్రవరి13: మండలం పరిధిలోని గుడిపెల్లి బోడగుట్టపై వెలసిన చెన్నకేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వసంత పంచమిని పురస్కరించుకొని భూనీళాదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణోత్సవానికి ఆలయం ముస్తాబైంది. ఈ కల్యాణ కార్యక్రమానికి నిర్వాహకులు, భక్త బృందం అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా బసంత్‌నగర్ పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.